ప్రజాశక్తి
సోమవారం 14 జులై 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : చిల్డ్రన్స్ పార్కు నిర్మించి 25 ఏళ్లపూర్తి చేసుకున్న సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్కు ఏర్పడి 25 ఏళ్లు అయిన సందర్భంగా 25 మొక్కలను మంత్రి నారాయణ నాటారు.. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ప్రారంభించారు. పార్కు ఏర్పాటుకు కృషిచేసిన జెవన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డంపింగ్ యార్డును తొలగించి కౌన్సిల్ లో పార్కుకి ఆమోదం తెలిపామని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ గుర్తు చేశారు. సిటీ లో 46 పార్కులను అన్నిహంగులతో ఏర్పాటు చేసిన ఘనత నారాయణ కె దక్కుతుందన్నారు. చిల్డ్రన్స్ పార్క్ ల్యాండ్ మార్కు స్థాయికి ఎదిగిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. పార్కు రూపురేఖలు మార్చేందుకు లియో కన్సల్టెంట్ ని పిలిపిస్తానని హామీ ఇచ్చారు.

నిరుద్యోగ సమస్యతో యువత విలవిల..!

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

○పాలకుల విధానాలతో నిరాశ, నిస్పృహలు..
○డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న విమర్శ
○ఘనంగా రూరల్ నాలుగో మహాసభ

ప్రజాశక్తి-నెల్లూరు

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన యువత పాలకుల విధానాల కారణంగా నిరుద్యోగ సమస్యతో కొట్టు మిట్టాడుతున్నారని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పేర్కొన్నారు. ఆదివారం వేదాయపాళెం ప్రాంతంలోని ఎ.వి.ఎస్ కళ్యాణ మండపంలో డివైఎఫ్ఐ రూరల్ 4వ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డివైఎఫ్ఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ 45 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అనేక ఆటుపోట్లను చవి చూసిందన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది నిరుద్యోగ సమస్య అన్నారు. ఉద్యోగం, ఉపాధి లేక యువత నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతుందన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర సమాచార శాఖ సర్వే ఆధారంగా స్వాతంత్ర భారత దేశంలో గతంలో ఎన్నుడూ లేని విధంగా నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని ఒక నివేదిక అందజేసిందన్నారు. సిఎంఐ సర్వే ప్రకారం 5 లక్షల మంది నిరుద్యోగులకు తక్షణమే ఉద్యోగ ఉపాధి కల్పిస్తేనే దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికి గురి కాకుండా కాపాడుకోవడం సాధ్యమౌతుందని వెల్లడించిందని గుర్తు చేశారు. ఇంత మంది ఆర్థిక వ్యవస్థలు చెబుతున్నా ఆ దిశగా ప్రభుత్వ పాలకులు చర్యలు చేపట్టడం లేదన్నారు. డివైఎఫ్ఐ మాజీ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నడిపేందుకు, దేశ పౌరులుగా తీర్చి దిద్దేందుకు డివైఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. మతోన్మాదులు అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగానికి ఒక తీవ్రమైన ప్రమాదం ఏర్పడిందన్నారు. దేశంలో మనువాద రాజ్యాంగం అమలులోకి రావాలని ఉద్దేశంతో ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే ఆర్ఎస్ఎస్ సపోర్టు చేస్తున్న రాజకీయ పార్టీ బిజెపి, ఇతర మతోన్మాద సంస్థలన్నీ ఈ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో యువతకు ఒక దిశ నిర్దేశం చేస్తూ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలల్లో డివైఎఫ్ఐ పురోగమిస్తుందన్నారు.మాజీ నాయకులు కట్ట సతీష్ మాట్లాడుతూ మతోన్మాదుల దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ప్రజల రక్షణ కోసం డివైఎఫ్ఐ పనిచేస్తుందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శిఎం.వి.రమణ మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని ప్రాంతాల్లో కమిటీలు వేసి డివైఎఫ్ఐని ముందుకు తీసుకెళ్లాలన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు , నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలు, సాధించిన విజయాలను ఈ మహాసభలో వివరించారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బి.పి.నరసింహ మాట్లాడుతూ జిల్లాలో డివైఎఫ్ఐకి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. యువత నిరాశ, నిస్పృహలకు గురికాకుండా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేం దుకు డివైఎఫ్ఐ పనిచేస్తుందన్నారు.ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా గోను చైతన్య, దేవతాటి రాజ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డివైఎఫ్ఐ కన్వీనర్ గోను చైతన్య, జిల్లా కమిటీ సభ్యులు జగదీష్, మాజీ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, నజీర్ బాషా, నాగార్జున, ఈశ్వరయ్య, మాలకొండయ్య, వీర్ల శ్రీనివాసులు, కొండా ప్రసాద్, ఒంగోలు సుధీర్,వలువూరు డివైఎఫ్ఐ మాజీ నాయకులు, సభ్యులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

డివైఎఫ్ఐ రూరల్ 4 వ మహాసభ చివరిగా నూతన కమిటీని నాయకులు ఎకగ్రీవంగా ఎంపిక చేశారు. రూరల్ డివైఎఫ్ఐ అధ్యక్షుడుగా డి.శశి, కార్యదర్శిగా గోను చైతన్య, సహాయ కార్యదర్శిగా దేవతాటి రాజ, ఉపాధ్యక్షులుగా జడ్డా బాపనయ్య, కోశాధికారి ఎస్.మధుబాబు, యువతుల కన్వీనర్గా కె.దుర్గ, కమిటీ సభ్యులుగా ఎండి అక్బర్, తుపాకుల రవి, సురేష్,డి.శ్రీనివాసులు, పెంచలయ్య, యు.శ్రీనివాసులు, బి.వెంకటేశ్వర్లు, డి.సుబ్రహ్మణ్యం, జి.సునీల్, దువ్వంత్, మధుబాబు, రోషన్, ఎం.నాగరాజ, ఎస్.కె.ఇక్బాల్, నాగరాజు,శివ, సునీల్లను ఎంపిక చేశారు.

డివైఎఫ్ఐ రూరల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి శశి, గోను చైతన్య

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల

సమస్యలకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-నెల్లూరు : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టారు. ఆదివారం నెల్లూరు నగరపాలక సంస్థ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు విధులు బహిష్కరించారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్ నుండి వి ఆర్ సి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, సిఐటియు నగర కార్యదర్శి జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత పది నెలలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని, సంబంధిత అధికారులను అనేక పర్యాయాలు కలిసి విన్నవించిన సమస్యలు పరిష్కారం అవలేదన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికుల వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచి, గ్రాట్యూటీ చెల్లించాలని, బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

విధిలేని పరిస్థితుల్లోనే మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలోకి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు కూడా అర్థం చేసుకొని మా సమ్మెకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే జులై 17 నుండి పారిశుధ్య కార్మికులు కూడా విధులు బహిష్కరించి సమ్మెలోకి పోతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు ఉపాధ్యక్షులు పి. సూర్యనారాయణ, శివాజీ, సురేష్, మున్సిపల్ ఇంజనీరింగ్ నాయకులు శ్రీనివాసులు, బాలు, మనోజ్, జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ, నగర అధ్యక్ష కార్యదర్శులు సునీల్, అశోక్, నాయకులు సుజాతమ్మ, వజ్రమ్మ, లోకేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ : రెస్టారెంట్లు, హోటళ్లలో కార్పొరేషన్ నిర్దేశించిన ప్రజారోగ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య హెచ్చరించారు. ఆర్టిసి బస్టాండ్ సమీపంలోని శ్రీనివాస భవన్ హోటళ్లలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్, ఎన్.ఓ.సి సర్టిఫికెట్ లు తనిఖీ చేశారు. వంటశాలల్లో నిర్వహణ తీరును పరిశీలించి నిర్వాహకులను వివరణ కోరారు. నగర కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా అన్ని వ్యాపార వాణిజ్య కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ, నిర్దేశించిన ప్రమాణాల తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'విఆర్సి' పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ : విఆర్సిలో జరిగిన పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయుల సమ్మేళనంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన లెక్కల మాస్టర్ నరసింహారెడ్డి, సైన్స్ మాస్టర్ చంద్రశేఖర్ లను మంత్రి నారాయణ ఘనంగా సన్మానించారు. బాల్య స్నేహితులతో అలనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. వి ఆర్ సి లోని డిజిటల్ క్లాస్ రూమ్ లు , వసతులతో విఆర్సిని అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రి నారాయణ ని గురువులు, పూర్వ విద్యార్థులు అభినందించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ జీవితంలో వెలుగులు నింపేది గురు వులేనని తెలిపారు. తన కలలకి ఉపాధ్యాయులే రూపశిల్పులని ఉద్వేగ భరితంగా మాట్లాడారు. యువనేత విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా అంతరా జ్జతీయ ప్రమాణాలతో స్కూల్ ఆధునీకరించినట్లు తెలిపారు.

యాచకుడు మృతి

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : వలేటివారిపాలెంలో ఆదివారం గురునాథం నాగరాజు (30) అనే యాచకుడు అనారోగ్యంగా మతి చెందాడు.సమాచారం అందుకున్న వలేటివారిపాలెం ఎస్ఐ మరిది నాయుడు తన సిబ్బంది రైటర్ ఏడుకొండలు ఎఎస్ఐ బ్రహ్మయ్యలతో సంఘటనా స్థలానికి చేరి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఉప్పలపాడు గ్రామ సమీపంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం పక్కన గల కాలనీ లో నివసిస్తూ భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తున్నటు తెలిసింది. గత కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతూ ఆదివారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

ఎంఎల్సి 'పర్వతరెడ్డి'కి సన్మానం

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్ : ఈనెల 2న ఎంఎల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కి నెల్లూరు రెడ్ క్రాస్ ఛైర్మన్గా ఉన్నప్పుడు ఆయన చేసిన సేవలను గుర్తించి ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ గోల్డ్ మెడల్ న ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక రామ్మునగర్ లోని వైసిపి సిటీ కార్యాలయంలో నాలుగో డివిజన్ వైసిపి ఇన్ఛార్జి షేక్ సంధాని భాష, కోఆర్డినేటర్ మధు ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాల ప్రజలు పర్వతరెడ్డికి అభినందనలు తెలిపి సన్మానించారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువరుర నగర నాయకులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-నెల్లూరు :వైద్య రంగంలో అందివస్తున్న సాంకేతికతపై అవగాహన పెంచుకుని తదనుగుణంగా ముందుకెళ్తే రోగులకు మెరుగైన చికిత్సను అందించడంతో పాటూ వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం. శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. పల్మనాలజీ విభాగంలో నేడు మారిన సాంకేతిక చికిత్సా పద్దతులపై ఆమె ఆదివారం " ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అప్డేట్ – 2025 " పేరుతో (సిఎంఈ– కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ , నెల్లూరుజిల్లా పల్మనాలజీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్లో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమానికి డాక్టర్ ఎం. శ్రావణి రెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా పల్మనాలజీ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ పిట్టి మల్లిమల్లిఖార్జున రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు 280 మంది వైద్యులు, పీజి విద్యార్థులు, క్రిటికల్ కేర్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్,డిఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, ఏడిఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్ వలీ, అపోలో హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కే.ఆర్.ఆర్. ఉమా మహేష్, యూనిట్ హెడ్ బాలరాజు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

"దేశానికి ఆహారం పెట్టే అన్నదాతల ను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, సిఐ టియు మండల కార్యదర్శి మారు బోయిన రాజా మహిళా సంఘం మండల అధ్యక్షురాలు కందిపాటి రమణమ్మ, ఆటో యూనియన్ కా ర్యదర్శి ఆరణి గోపీలు డిమాండ్ చే శారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద యూరియా కోసం నిర్వ హించనున్న ధర్నాకు రైతులను స మీకరించేదు కోసం ఆదివారం వారు మండలంలో పర్యటించారు. ఈ సం దర్భంగా వారు నరుకూరులో మాట్లాడారు. యూరియా కోసం జిల్లా కలె క్టర్ ఆఫీస్ వద్ద జరుగు ధర్నా కార్య క్రమంలో రైతులు పాల్గొని జయప్ర దం చేయాలని లక్ష్మయ్య, రాజా, ర మణమ్మ, గోపీలు పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పెరిగిన కూరగాయల ధరలు

కేజీ పచ్చిమిర్చి రూ.70 - పేదలు లబోదిబో..

ప్రజాశక్తి-కందుకూరు :కూరగాయల ధరలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. పేదవాడు కొనుగోలు చేయలేని అంతగా గత నెల రోజుల్లో కూరగాయలు పెరిగాయి. నెల రోజుల క్రితం వరకు కేజీ టమాటాల ధర 16 రూపాయలు ఉండగా ప్రస్తుతం 33 రూపాయలకు పెరిగాయి. కేజీ 20 రూపాయలకే వస్తున్న వంకాయల ధర ఏకంగా 50 రూపాయలకు చేరింది. బెండకాయలు ధర మార్కెట్లో 25 నుంచి 30 రూపాయలు పలుకుతుంది. పచ్చిమిర్చి ధర ఒక్కసారిగా ఎగబాకింది. వారం రోజుల కిందట వరకు 30 రూపాయలు ఉండగా నేడు ఆ ధర 70 రూపాయలకు చేరింది. పేదవాడు పచ్చిమిర్చి ధర విని నోర్లు ఎల్లబెడుతున్నారు.కాకరకాయలు 50 రూపాయలకు పెరిగాయి. 40 రూపాయలు ఉన్న బీరకాయల ధర 50 రూపాయలకు చేరింది. క్యాబేజీ ధర మాత్రం 25 రూపాయలు ఉండటంతో ప్రజలకు కొద్దో గొప్ప అందుబాటులో ఉంది. దొండకాయల కిలో 30 రూపాయలకి చేరింది. గోరుచుట్టు ధర ఏకంగా 45 రూపాయలకు అమ్ముతున్నారు. చామదుంపల ధర 45 రూపాయలు పలుకుతుంది. మునక్కాయలు కేజీ 55 రూపాయలు పలుకుతున్నాయి. పెద్ద చిక్కుళ్ళు అయితే ప్రజలకు కొనుగోలు చేయలేనంత ధరకు చేరింది. కిలో 75 రూపాయలకు అమ్ముతున్నారు. నిన్న మొన్నటి వరకు కిలో 30 రూపాయలు అమ్మిన క్యారెట్ ధర ప్రస్తుతం 65 రూపాయలకు పేరిగింది. రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు ప్రజలకి ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పెరిగిన ధరలతో ఏమి కొని ఏమి తినాలనే భావన ప్రజలలో ఉంది. ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారాలు చెబుతున్నారు. కందుకూరు ప్రాంతంలో కూరగాయల సాగు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు మానుకు న్నారు. దాంతో ఇతర ప్రాంతాల నుండి కందుకూరు కి కూరగాయల దిగుమతులు జరుగుతున్నాయి.దాని ఫలితంగా ధరలు పెరగడం ఓ కారణమని చెప్పవచ్చు.

పలుచోట్ల 'ఇంటింటికి టిడిపి'

గుడ్లూరు మండలంలో..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలంలోని పొట్లూరు గ్రామ పరిధిలోని ఎస్టి కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొట్లూరు గ్రామంలో మురికి నీటి డ్రైనేజ్ సమస్యను గమనించి అధికారులకు వెంటనే గ్రామంలోని మురికి నీటి సమ స్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గుడ్లూరు టిడిపి మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, క్లస్టర్ ఇన్చార్జిలు, చిత్తారి మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, గ్రామ నాయకులు ఎస్.కె. రహంతుల్లా. పాతల్లపల్లి శ్రీనివాసులు.ఎం శ్రీనివాసులు ఉన్నారు.

ప్రజాశక్తి - లింగసముద్రం

మండలంలోని విశ్వనాధపురంలో ఆదివారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బొల్లినేని సుబ్బారావు పాల్గొన్నారు. టిడిపి నాయకులు ఉన్నం వీరాస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉన్నం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం మండలంలో..

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి-కందుకూరు

ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ గ్రామీణాభివద్ధి , ఇంజనీరింగ్ ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ సంక్షేమ సంఘం ప్రకాశం జిల్లా యూనిట్ ఏర్పాటు చేయడానికి ఆదివారం ఒంగోలు కాపు సంఘం భవనము లో పాత ప్రకాశం జిల్లా రిటైర్డ్ ఉద్యోగులతో సమావేశం జరిగింది. ఈ సమావేశం జిల్లా కమిటీ అధ్యక్షులు బి. రామరాజ్ కుమార్, సెక్రటరి పి. సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ పంచాయత్ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వైస్ ప్రెసిడెంట్ మంచిరాజు వెంకట మురళీ మోహన్, రిటైర్డ్ పంచాయత్ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సంఘం లో ప్రత్యేకంగా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, రూరల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ లందు పదవీ విరమణ పొందిన వారితో మాత్రమే ఏర్పడింది. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గా టీ. ఎమ్. బుచ్చిరాజు ఉన్నారు. ఈ సంఘం ద్వారా పంచాయత్ రాజ్ వ్యవస్థ లో ఉద్యోగ విరమణ పొందిన వారి సమస్యలు, ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిల గురించి చర్చించి రాష్ట్ర సంఘం తో కలిపి పరిష్కరించడానికి ఎర్పడింది. ఈనేల 27న రాష్ట్ర స్థాయి సమావేశము గుంటూరులో జరపాలని నిర్ణయించారు. ఒంగోలులో జరిగిన ఈ కార్యక్రమంలో పాత ప్రకాశం జిల్లా నుండిరిటైర్డ్ ఇంజనీర్ లు, యం. డి. ఓ లు , కందుకూరు నుండి మంచిరాజు వెంకట మురళీ మోహన్,రిటైర్డ్ , ఆగస్టీన్, మసీర్ మెహబూబ్, రిటైర్డ్ యం. డి. ఓ, మాలకొండయ్య పాల్గొన్నారు.



నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు

విలాసాలకు అలవాటు పడి ఒంటరిగా ఉన్న ప్రజలకు మరణాయుధాలు చూపించి భయాందోళనలకు గురిచేసి బలవంతంగా నగదు తీసుకొని పారిపోయిన ఐదుగురు నిందితులను వేదాయపాళెం పోలీసు స్టేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం వేదాయపాళెం పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ జి.నవీన్లు నిందితుల అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం మేరకు చంద్రబాబు నగర్ ప్రాంతానికి చెందిన విజయ్ అలియాస్ పుండా, గుర్రం సుధీర్, షేక్ సిరాజ్, పోలీసు కాలనీ ప్రాంతానికి చెందిన పోలా అనిల్, దిలీప్ నర్సింగ్ హెూం ప్రాంతానికి చెందిన బెల్లం కొండ సాయిలను పోలీసులు అదుపులోకి తీసుకోని, వారి వద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదిన తల్పగిరి కాలనీ సమీపంలో నాగేంద్ర అనే వ్యక్తికి కత్తి చూపించి నిందితులు నగదు ఇవ్వాలని బెదిరించగా తన వద్ద నగదు లేని చెప్పినప్పటికీ బెదిరించి ఫోన్ పే ద్వారా రూ. 5 వేలు నిందితుల బ్యాంకు ఖాతాలో జమ చేయిం చుకున్నట్లు బాధితుడు వేదాయపాళెం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఫిర్యాదును ఆధారంగా చేసుకోని సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను చంద్రబాబు నగర్ మెయిన్ రోడ్డు ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభను కనపరిచిన హెడ్కానిస్టేబుల్స్ను ఎస్పి, నగర డిఎస్పి అభినందించారన్నారు.

శివకుమార్కు ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి -నెల్లూరు :డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యం లో కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం 2025 అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్కు ఆదివారం ఆత్మీయ సన్మానం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య వక్త గా రచయిత్రి చంద్రలత పాల్గొన్నారు. బాలసాహిత్య పరిమళాలను వాటి గొప్పతనాన్ని ఆమె ఉదాహరణలతో వివరించారు. అనంతరం గంగిశెట్టి శివకుమార్ రచనల బాలసాహిత్యాన్ని విశ్లేషించారు. ఈ సందర్భంగా రచయిత్రి చంద్రలతను ఆత్మీయ సత్కారంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం ఎల్ సి విఠపు బాలసుబ్రహ్మణ్యం, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజ గోపాల్, రచయిత పాతూరి అన్నపూర్ణ ,సుభద్ర దేవి పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు మృతి
కళా రంగానికి తీరని లోటు

ప్రజాశక్తి-కందుకూరు : నటుడు కోట శ్రీనివాసరావు మృతి కళా రంగానికి తీరని లోటని కందుకూరు కళాకారులు తెలిపారు. స్టేజి ఆర్టిస్టుగా నాటకాలతో నట ప్రస్థానం మొదలు పెట్టి సినీ పరిశ్రమంలో ఎన్నో విభిన్నమైన పాత్రలను పోషించి మెప్పించిన గొప్ప నటుడు అని పలువురు కొనియాడారు. కోట శ్రీనివాసరావు మృతి బాధాకరమని జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు ముప్పవరపు కిషోర్, కార్యదర్శి చనమాల కోటేశ్వరరావు, ట్రెజరీ గాండ్ల.హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. తొలికిరణం సినిమా షూటింగ్ సమయంలో తనకు కోట శ్రీనివాసరావుతో కొంత వ్యక్తిగత పరిచయం ఏర్పడిందని కిషోర్ తెలిపారు.

పరకొండపాడులో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోని పరకొండపాడులో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటుంది. చెత్తను తీసుకెల్లే ట్రై సైకిల్స్ గ్రామంలో రెండు ఉన్నప్పటికీ ఒకటే ఉపయోగంలో ఉంది. మరొక ట్రై సైకిల్ మనిషి లేక ఖాళీగా ఉంది. నివాస స్థలాల మధ్య పెద్ద ఎత్తున జంగిల్ ఉన్న కారణంగా విష సర్పాలు సంచరిస్తున్నాయని, సర్పంచ్ కోల కొండయ్య గానీ గ్రామ నాయకులు గానీ గ్రామాభివృద్ధి గురించి పట్టిం చుకోవడం లేదని గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు .గ్రామంలో నెలకొన్న ఆధిపత్య పోరుతో గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని అభిప్రాయపడు తున్నారు. మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చెబుతున్నారు. పాఠశాల పరిసర ప్రాంతం సైతం జంగిల్తో నిండిపోయిందంటున్నారు .గ్రామంలో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీనిపై గతంలో ప్రజాశక్తిలో కథనం వచ్చింది. ఈ కథనంపై గ్రామానికి చెందిన నాయకులు స్పందించి ఇంకుడు గుంతలు తీయించి మళ్లీ పూడ్చివేశారు. ఎందుకు గుంతలు తీశారో.. ఎందుకు పూడ్చారో తెలియటం లేదని చెబుతున్నారు. గ్రామంలో విద్యుత్ స్తంభాల సమస్య ఉంది. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ కార్యదర్శి స్పందించి మండల అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకెళ్లి గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

ముగిసిన క్రీడా సంబరాలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :కీడల ద్వారా పోటీ తత్వం, ప్రశ్నించే తత్వంతో పాటు సహాయపడే తత్వం అలవ రుస్తుందని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో పదో జిల్లా రెవెన్యూ క్రీడా సాంస్కృత ఉత్సవాలు–2025 ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. క్రీడల ద్వారా వచ్చిన స్ఫూర్తిని పనులలో చూపిం చినట్లైతే మంచి ఫలితాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఇంకా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జిల్లా రెవెవిన్యూ అధికారి శ్రీ హుస్సేన్ సాహెబ్ మాట్లాడారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు పావని, పావని, వంశీకష్ణ, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పది క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :తోటపల్లిగూడూరు మండలం కోడూరు సముద్ర తీరంలో ఆదివారం సందడి వాతావరణం ఏర్పడింది. మండుతున్న ఎండల ప్రభావం నుం చి ఉపశమనం పొందేందుకు జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు కోడూరు తీరానికి తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల రాకపోక లు సాగాయి. కుటుంబాల సమేతం గా కదలి వచ్చి తీరం వెంబడి సంద డి చేశారు. ముఖ్యంగా యువత ఆ టపాటలతో సందడి చేసింది.

రత్నాకర్ నియామకంపై హర్షం

ప్రజాశక్తి-కావలి

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్‌గా పి.రత్నాకర్‌ను నియమించడంపై లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ముడిగండ్ల మాలకొండ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ సీనియర్ అధికారైన రత్నాకర్ ఇప్పటివరకు సి.బి.సి.లో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారు ప్రకాశం జిల్లా కరుమంచి గ్రామంలో జన్మించి ఐ.ఐ.ఎస్. అధికారిగా పనిచేస్తూ నేడు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారి శ్రేయోభిలాషి, సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండా రెడ్డి విజయవాడలో వారి నివాసంలో కలిసి ప్రశంసలతో వారిని అభినందించారు. వారు విద్యార్థి దశ నుండి పలు కేంద్ర ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసే సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఈరోజు పిఐబి డైరెక్టర్గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అధికారిగా నియమించడం అభినందనీయమన్నారు.

మూగజీవాలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - ఉదయగిరి

అటవీ వన్యప్రాణుల సంరక్షణ కరువుతో సంబంధిత అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనంగా మూగజీవాలైన జింకలు, దుప్పులు దాహం తీర్చుకునేందుకు అటవీ ప్రాంతం నుండి గ్రామంలోకి రావడంతో అంతం లేని మరణాలతో మూగజీవాలు కళేబరాలుగా దర్శనమిస్తున్నాయి. ఇంత జరుగుతున్న అటవీశాఖ అధికారులు మూగజీవాల సంరక్షణ కొరకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయంగా ఉందని విమర్శిస్తున్నారు. అటవీలో మూగ జీవాల దాహం తీర్చేందుకు నీటి కుంటలను ఏర్పాటు చేయకపోవడంతో దాహం తీర్చుకునేందుకు వస్తున్న మూగజీవులు మరణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అటవీ జీవుల మరణాలను ఆపేందుకు అటవీలో వాటి సంరక్షణ కోసం నీటి కుంటలు తదితర చర్యలు చేపట్టి అంతం లేని మూగజీవాల మరణాలను ఆపాలని పట్టణ ప్రజలు పలువురు ప్రజా ఉద్యమ నేతలు కోరుతున్నారు. అందులో భాగంగా పట్టణంలో కొద్ది రోజుల నుండి ఒక జింక నక్క ఆదివారం స్థానిక దేవాలంగడ్డ నివాస ప్రాంతాల్లోకి కణితి దాహార్తి కోసం వచ్చి మరణం పొంది ఉన్న పట్టణంలో దర్శనమిచ్చింది. అటవీ శాఖ అధికారులు నీటి కోసం నివాస ప్రాంతాలకు వచ్చినట్లు సమాచారం రావడంతో ఎఫ్‌బిఒలు లక్ష్మీ ప్రసన్న, ప్రసాద్, ఎబిఒ వెంకటేశ్వర్లు ఘటనా ప్రాంతానికి ఈద్గా ప్రాంతంలో దాని కోసం వచ్చిన చాకచక్యంగా పట్టుకొని సురక్షితంగా అడవిలోకి వదిలేశారు. ఈ ఘటన పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలను చూపాలని పలువురు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ మండలం గౌరవరం గిరిజన కాలనీలో గోల్కొండ మునెయ్య, గోల్కొండ వెంకాయమ్మ గిరిజన కుటుంబం గౌరవరం దగ్గర చేపల గుంటల వద్ద పని చేసుకొని జీవిస్తుంటారు. శనివారం ఉదయం చేపల గుంటల వద్ద పనికి వెళ్లిన సమయములో ఇల్లు పూర్తిగా కాలి పోయింది. వారికి ఒంటి మీద గుడ్డలు తప్ప ఏమీ మిగలలేదు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు చింతం బాబుల్ రెడ్డి, గిరిజన కార్యకర్త ఇండ్ల సురేంద్ర కావలి రెడ్‌క్రాస్‌కు సమాచారమిచ్చారు. ఆదివారం కావలి రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్ మనోహర్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బృందం గౌరవరం గిరిజన కాలనీకి వెళ్లి తక్షణ సహాయంగా జిల్లా రెడ్‌క్రాస్ అందించిన వంటపాత్రల సెట్, కావలి రెడ్‌క్రాస్ ద్వారా నూతన దుస్తుల కిట్, జనిగర్ల మనోహర్ స్వంత నిధులతో 25కిలోల బియ్యం బస్తా అందజేశారు. ఈ సందర్భంగా జనిగర్ల మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుతం కొంత సామాగ్రిని తక్షణ సహాయంగా అందించామని, తదుపరి రెడ్‌క్రాస్ సభ్యుల సహకారంతో మరికొంత సహాయ సామాగ్రి అందజేస్తామన్నారు. అగ్ని ప్రమాద సమాచారం అందించగానే తమకు వంటపాత్రల సెట్ పంపిన జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ చామర్తి జనార్ధన్ రాజుకు, అగ్నిప్రమాద సమాచారం అందించిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎక్కడైనా ఇటువంటి అగ్ని లేదా ఇతర ప్రకృతి వైపరీత్యం జరిగినపుడు కావలి ఆర్‌డిఓ కార్యాలయ ఆవరణంలోని రెడ్‌క్రాస్‌కు సమాచారమందిస్తే తమవంతు సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవి ప్రకాష్, వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి, పాలకమండలి సభ్యులు బీదా లక్ష్మానంద, బెజవాడ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి బిట్రగుంట



బోగోలు మండల విస్తత స్థాయి సమావేశం 15వ తేదీ మంగళవారం నిర్వహించ బడుతుందని మండల వైసిపి కన్వీనర్ మద్ది బోయిన వీరరఘు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వైసిపి కుటుంబ సభ్యులకు 15వ తారీకు ఉదయం 9 గంటలకు బోగోలులోని కార్యాలయంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై మండలస్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎంఎల్‌ఎ, కావలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అందరు ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి కార్యకర్తలు పాల్గొని మన నాయకుల సలహాలు, సూచనలు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై చర్చలు నిర్వహించబడతాయని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని టిడిపి నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఏడాది పాలన గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో గ్యాస్ సిలిండర్లు సబ్సిడీ గురించి, పింఛన్ల పంపిణీ గురించి, తల్లికి వందనం పథకం గురించి మంజూరు అయ్యాయో లేవో తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెయిన్ రోడ్‌లోని మూడో వార్డులో టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ డాక్టర్ కాజా మియా, మాజీ ఎఎంసి డైరెక్టర్ వాకిచర్ల వీర ప్రతాప్ అలియాస్ బాబు, బూత్ లెవెల్ ఏజెంట్ సయ్యద్ షఫి, మైనార్టీ నాయకులు నజీర్ అహ్మద్, అస్మత్, కాజా మస్తాన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజాసేవకుడు జివి శివప్రసాద్

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

జివి శివప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు, స్వచ్ఛంద సేవకులు

ప్రజాసేవలో అవినీతి మరకలేని మహోన్నత వ్యక్తి సిఐటియు జిల్లా నాయకుడు జి వి శివప్రసాద్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని చెర్లో రమణారెడ్డి భవన్ (సిపిఎం) కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జివి శివ ప్రసాద్ ఇటీవల ఉద్యోగ పదవీ విరమణ పొందడంతో ఆయనకు సన్మానకార్యక్రమం నిర్వహించారు. జివి శివప్రసాద్‌ను శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రెడ్ సేవా సంస్థ అధ్యక్షులు వాగాల శ్రీహరి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి వి శివప్రసాద్ చేసిన కార్మిక కర్షక శ్రామిక యూనియన్లతో వారి సమస్యల పైన, స్థానిక ప్రజా కార్యక్రమాలపైన అనేక పోరాటాలు చేసి వృత్తి ధర్మంగా ఒక ఉద్యోగిగా పనిచేస్తూ ప్రజా సంఘాలని కలుపుకొని అనేక సమస్యలు, అనేక కుటుంబాల వారికి ఆదర్శంగా నిలిచిన మన శివప్రసాద్ ఉద్యోగ పదవి విరమణ అయిన సందర్భంగా ప్రజా సమస్యలపై నిత్యం పోరాటంలో భాగసా్వములు అవుతున్నందుకు శివప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.పుల్లయ్య, టౌన్ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ షేక్ సంధాని, సిపిఎం మాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు గంటా లక్ష్మీపతి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.నాగయ్య, ట్రేడ్ యూనియన్ నాయకులు ప్రజా సంఘ నాయకులు మహిళ నాయకులు ఈ అభినందన సభలో పాల్గొన్నారు.

'సంయుక్త' చిన్నారులకు అభినందనలు

ప్రజాశక్తి-కావలి

చిన్నారులను అభినందిస్తున్న దృశ్యం

ఇటీవల రెడ్‌క్రాస్ కావలి శాఖ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పాల్గొని రక్తం ఆవశ్యకతపై చేసిన లఘునాటిక (స్కిట్) మొదటి బహుమతిని సొంతం చేసుకున్న సంయుక్త నృత్య కళా నిలయం చిన్నారులను ఆదివారం బి.వి. రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.వి.ఎన్.ప్రసాద రావు క్రిష్టియన్ పేట మొదటి లైన్లో ఉన్న సంయుక్త నృత్య కళానిలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ పి.శివప్రసాద్, సంస్థసభ్యులు షేక్.ఖాదర్ బాషా, జి.కళ్యాణి, ప్రముఖ వ్యాపారవేత్త పచ్చి పులుసు వెంకన్న, అర్వపల్లి నాగరాజు, పి.రాజ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్, ఎం.వి.ఎన్.ప్రసాద రావులు మాట్లాడుతూ సంయుక్త నృత్య కళా నిలయం చిన్నారులు రక్తం యొక్క ఆవశ్యకతపై చేసిన లఘునాటికి చూపరులను కంట తడి పెట్టించిందని తెలిపారు. రక్తం దొరకని పక్షంలో బాధితులు పడే ఆవేదనను కళ్ళకు కట్టినట్లు చూపించారని, ఎంతోగొప్పగా నటించారని తెలిపారు. మొదటి బహుమతిని సొంతం చేసుకున్న సంయుక్త నృత్య కళానిలయం చిన్నారులను అభినందించిన అనంతం సర్టిఫికెట్స్ అందజేశారు. నాట్య గురువు గంగపట్నం లిఖితను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో మరెన్నో బహుమతు అందుకోవాలని, తమ విద్యార్థులతో మరెన్నో గొప్పగొప్ప ప్రదర్శనలు చేయించాలని కావలి పట్టణానికి మరింత పేరు తీసుకు రావాలని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-బిట్రగుంట

బిట్రగుంట రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ 1980 – 1981 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు బిట్రగుంట ఇబ్రహీంపేట చిన్న బజార్‌లోని జామియా మసీదు పక్కన ఉన్న ఎం.కె. కళ్యాణ మండపంలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 70మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు ఒక చోటికి చేరి నాటి పాఠశాలలో చదివిన భావ కాలాన్ని గుర్తు చేసుకున్నారు. తాము ఉన్నత స్థాయికి చేరెందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ బిట్రగుంటను మినీ ఇంగ్లండ్‌తో పోల్చేవారని, రైల్వే లోకో షెడ్డులో సుమారు 2వేలమంది రైల్వే కార్మికులు రాత్రింబవళ్లు పనిచేస్తూ ఉండేవారని, రైల్వే ఎలక్ట్రికల్ ఇంజన్లు రావడంతో కాలక్రమేణా లోకో షెడ్డు మూతపడిందని, బిట్రగుంట అంటే పుట్‌బాల్ క్రీడకు పెట్టింది పేరు అని, క్రీడాలతోనే బిట్రగుంటలోని వారికి స్టేట్, సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాలు పొందారని గుర్తు చేసుకున్నారు.

జ్యోతి శ్రీనివాసులు నియామకం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

బిఎస్‌పి లీగల్ అడ్వైజర్‌గా నియమితులైన జ్యోతి శ్రీనివాసులు

కాన్షీరాం ఆశించిన బహుజన సమాజ నిర్మాణం కోసం దళితులంతా అంకితభావంతో కృషి చేయాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షురాలు పుష్పాంజలి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని బహుజన సమాజ్ పార్టీ ఆత్మకూరు నియోజక వర్గం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యకర్తల సమావేశానికి బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు క్రాకుటూరు పుష్పాంజలి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్షీరామ్ ఆశించిన బహుజన సమాజ నిర్మాణం కోసం దేశంలోని దళితులందరూ అంకిత భావంతో పని చేసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బహుజన సమాజాన్ని అంబేద్కర్ వాదులైన దళిత నాయకత్వంలో నడవాలని ఆమె అన్నారు. అనంతరం నియోజకవర్గ కార్యదర్శిగా, బిఎస్‌పి లీగల్ అడ్వైజర్‌గా లాయర్ జ్యోతి శ్రీనివాసులును నియమించారు. అలాగే ఆత్మకూరు మండల అధ్యక్షులుగా కె.హజరత్‌ను నియమించారు. నూతనంగా ఎన్నుకోబడిన వారికి బిఎస్‌పి కండువా కప్పి ఆహ్వానించారు. లీగల్ అడ్వైజర్‌గా ఎన్నికైన జ్యోతి శ్రీనివాసులు మాట్లాడుతూ కాన్షీరాం ఆశించిన బహుజన సమాజ నిర్మాణం కోసం తమ వంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు టౌన్ అధ్యక్షులు బుర్ర శేషాద్రితోపాటు నియోజకవర్గం కార్యకర్తలు, బిఎస్‌పి సభ్యులు హాజరయ్యారు.

ట్రాన్స్‌ఫారంతో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-ఉదయగిరి : బిట్-3 సచివాలయం ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫారం చుట్టూ చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో ఈదురు గాలులకు వైర్లు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయన్నారు. పలుసార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొంచి ఉన్న ప్రమాదం నుండి రక్షించాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో మహిళలు ర్యాలీ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట:

పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపడుతున్న మహిళలు

రాజకీయాల్లో విమర్శలకు ప్రతి విమర్శలు ఉండాలి గానీ ఎప్పుడూ వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడకూడదని టిడిపి మండల అధ్యక్షుడు ఏకోళ్ళు పవన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తూరు సాయిబాబా గుడి నుండి తహశీల్దార్ వరకు మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ మహిళలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీజీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్య సమాజంలో మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీలను నీచంగా మాట్లాడే సంస్కృతి జిల్లాలో ఇప్పటివరకు లేదని, ప్రసన్నకుమార్ రెడ్డి మహిళ ఎంఎల్‌ఎపై అనూచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ప్రసన్నకుమార్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకి పతనం ఆరంభమైందని, నియోజకవర్గంలోని మహిళలంతా నేడు ప్రసన్నకుమార్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రసన్నకుమార్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, చెంచు కిషోర్ బాబు, దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దేవి రెడ్డి రవీందర్ రెడ్డి, దాసరి విజయ్, మధుసూదన్ రెడ్డి, బిజెపి నాయకులు కైలాసం శ్రీనివాసులరెడ్డి, ముంగర గోపాల్ యాదవ్,మహిళ టిడిపి నేతలు పుట్ట పద్మ, బద్దిపూడి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

16న ఉచితంగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై వారి సహకారంతో కొర్రపాటి కుమార రాజా చౌదరి, సుశీలమ్మ సౌజన్యంతో ఇమెడ్ ఈవెంట్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఉచిత కంటి పొరచికిత్స జూలై 16నుండి 22వరకు 7రోజులు పాటు ఉదయం 9గంటలు నుండి మధ్యాహ్నం 1గంట వరకు చూడడం జరుగుతుందన్నారు. ఈ ఉచిత కంటి శుక్లం చికిత్స కేంద్రంలోకంటి శుక్లం గలవారికి మాత్రమే ఆపరేషన్ చేస్తారని, కంటి శుక్లం ఆపరేషన్‌ను జూలై 20నుండి 24వరకు డాక్టర్లు చేస్తారని తెలియజేశారు. అవసరమైన వారు ప్రసాద్ 9000004034, వెంకటేశ్వర్లు 7659820974, నరేష్ 9492444312 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఉదయగిరి

ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిల్లాలో అత్యంత వెనుకబడి వున్న ఉదయగిరి నియోజకవర్గంలో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటికీ పరిష్కారం చూపాలని ఉదయగిరి డెవలప్మెంట్ ఫోరం డిమాండ్ చేస్తూ శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లిలో జరుగు అనంతగిరి గంగాభవాని నెలపొంగల సందర్భంగా వచ్చిన శాసనసభ్యులకు యుడిఎఫ్ ప్రతినిధులు వి.రామచంద్రమూర్తి, ఎండి. ఖాజ కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి మెట్టప్రాంత ఇబ్బందులను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో రైతులు చిన్ననీటి సాగువనరులపై ఆధారపడి వ్యవసాయం చేసుకొంటున్నారని, వర్షాకాలంలో పడిన ప్రతినీటి బొట్టును వృథా కాకుండా చూడాలని కోరారు. చెరువులను, చెక్ డ్యామ్‌లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. గండిపాలెం, మర్రివూట్ల, నక్కలగండి రిజర్వాయర్లను, ప్రధాన కాలువలను అధునీకరించాలని కోరారు.

ఉదయగిరి, వింజమూరులలోని 30 పడకల ఆస్పత్రులను 10 0పడకలుగా పెంచాలని, ఉదయగిరి ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఉదయగిరి, కొండాపురం, తెల్లపాడు, చినక్రాకలలో గల యూనాని, ఆయుర్వేద వైద్యశాలల్లో డాక్టర్లు లేక మూత పడివున్నాయని ఆయుష్ శాఖ ద్వారా వాటిని తెరిపించి వైద్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. సాంకేతికపరంగా ఉదయగిరి నియోజకవర్గం వెనుకపడివుందని పాలిటెక్నిక్ కళాశాలను ఇక్కడ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. గంగిరెడ్డిపల్లిలో మంజూరై వున్న మైనారిటీ బాలికల పాలిటెక్నిక్ కళాశాల ఏమైందని వారు ప్రశ్నించారు. ఈ నియోజకవర్గంలో చిన్న పరిశ్రమలు పెట్టే ఔత్సాహికులను ఆహ్వానించి ప్రోత్సహించాలని కోరారు. చరిత్ర ప్రసిద్ధి చెందిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రదేశంగా గుర్తించేందుకు శ్రద్ధ చూపాలని వారు కోరారు. ముఖ్యంగా ఉదయగిరిలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటుచేసి జిల్లా అధికారులందరినీ పిలిచి నియోజకవర్గంలోని ప్రజాసమస్యల సాధనకు కషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్‌పి చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- సీతారాంపురం

ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామంలో నిన్న పాము కాటుకు గురై చనిపోయిన అంకి పుష్ప అనే మహిళకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సింగారెడ్డి పల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకుల సమక్షంలో, మండల టిడిపి నాయకుడు చింతల శ్రీనివాసులు రూ.5వేల ఆర్థికసాయం అందించారు. వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ఏవైనా ఉంటేవారికి అందేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు మండల యువత అధ్యక్షుడు పసుపులేటి వికాస్, అప్పని శ్రీను, గ్రామ నాయకులు పానం మురళి, రఘురాములు, జనార్ధన్, శేఖర్, సుబ్బారెడ్డి, భాస్కర్, నరసింహులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు మెంబర్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణ మేజర్ పంచాయతీ 4వ వార్డ్ సభ్యులు గాజుల ఖాదర్ బాషా వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉమ్రా యాత్ర కు ఆదివారం బయలుదేరారు. ఈ క్రమంలో ఉపసర్పంచ్ షేక్ ముత్తూజా హుస్సేన్ యాత్ర సజావుగా కొనసాగి అల్లా ఆశీస్సులు పొందాలని, అలాగే ఉదయగిరి పంచాయతీ ప్రజల మీద కూడా ఆ దేవుడు ఆశీస్సులు ఉండాలని ఆయనకు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

అమ్మవారికి పొంగళ్లు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసి ఉన్న అనంతపురి గంగాభవాని అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు నెల పొంగళ్ళు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ల సామాగ్రిని నూతన బుట్టల్లో ఉంచుకుని మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామోత్సవంగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించి ఆవరణలో పొంగళ్లు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేథ్యం సమర్పించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు .

మహిళలను కించపరిచేలా ప్రసన్న వ్యాఖ్యలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మాట్లాడుతున్న నాయకులు

ఇటీవల కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మహిళలందరినీ కించపరిచేలా ఉన్నాయని టిడిపి నాయకులు పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని లోటస్ గ్రాండ్ హోటల్‌లో పెనుబల్లి పంచాయతీ సాల్మన్‌పురం గ్రామ టిడిపి నాయకులు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై మాజీ శాసనసభ్యులు, మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు మహిళలందరి మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ప్రసన్న కుమార్ రెడ్డి అటువంటి భాషను ఎంచుకోవడం సబబు కాదన్నారు. రాజకీయపరంగా ఎటువంటి విమర్శలు చేసిన ఎదుర్కొనేందుకు ప్రత్యర్థులు సవాల్‌గా తీసుకోవటం సహజమేనన్నారు. వ్యక్తిగత విషయాలను మాట్లాడటం, మహిళలపై గౌరవం లేకపోవడం ప్రసన్నకుమార్ రెడ్డి లాంటి వ్యక్తికి కరెక్ట్ కాదని విమర్శించారు. ఎన్నోయేళ్ల నాటి సాల్మన్ పురం శ్మశానం సమస్యలను తీర్చలేని ప్రసన్న అభివృద్ధి గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సల్మాన్‌పురం గ్రామస్తులు ఆమెను కలసి శ్మశాన సమస్యను తెలుపగా వెంటనే సమస్యను తీర్చడం జరిగిందన్నారు. మరోసారి తమ నాయకురాలిపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని టిడిపి నాయకులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిపై మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మెంబర్ సిద్ధన కొండారెడ్డి, మల్లు రఘురామిరెడ్డి, మల్లు పెంచలరెడ్డి, నెల్లూరు వెంకటేశ్వర రెడ్డి, సిద్ధన మనోహర్ రెడ్డి, అంకితపల్లి రమేష్, భూమిరెడ్డి రవిచంద్ర, ఎర్రబల్లి నాగేంద్ర, గంపల నరసయ్య, సన్నపురెడ్డి నాగేశ్వరరెడ్డి, మహేష్ రెడ్డి, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

In the Court of the Principal Senior Civil Judge:: Nellore
E.P.No.132/2022
O.S.No.169/2018

Palnati Mallikarjuna Naidu ... D.H.R
Vs
1.Katuru Prabhavathamma 2 Others ...J.D.R's

Notice

To,
J.D.R-2. Katuru Pradeep Reddy S/o. Late Raghava Reddy, residing at D.No.27-2-268, Sub Registrar Office Road, Balaji Nagar, Nellore City, S.P.S.Nellore District.
J.D.R-3. Katuru Hima Bindu D/o. Late Raghava Reddy, Wife of Nallapureddy Vinod Reddy, residing at Flat No.G3, Prudviraja's, Vishnavi Classic, Sujathamma Colony, Dargamitta, Nellore City

పై నెంబరున డిక్రీహోల్డర్ జప్తు కాబడిన జె.డి.ఆర్స్ తాలూకు స్థిరాస్తిని వేలంకు కోరినందున, సదరు E.P. లో మీకు సేల్ నోటీసు (ఆర్డరు 21, రూల్ 66) నిమిత్తం **తే.17-07-2025దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామా ధమరేశ్వర్, B.A., B.L.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు. సెల్: 94405 68089

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO 522/2024

పసుపులేటి వెంకటేశ్వర్లు ...వాది
వర్సస్
ముత్యాల వెంకటేశ్వర్లు ...ప్రతివాది

To:
ప్రతివాది చిరునామా:
ముత్యాల వెంకటేశ్వర్లు తండ్రి సుబ్బయ్య,
వయస్సు 62 సంవత్సరాలు, ప్రైవేట్ ఉద్యోగం,
నివాసం రామాలయం దగ్గర, సీతారామాపురం గ్రామం,
సీతారామాపురం మండలం, నెల్లూరు జిల్లా.

వాది మీపైన బాకీ రాబట్టు నిమిత్తం పై కోర్టు నందు దావా దాఖలు చేసి ఉన్నందున ఆ దావాలో మీకు శ్రీకోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీకు చేరనందున మీ హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు తేది: 22-07-2025 కి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని, లేదా లాయరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరై పై దావాలో మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ: 22-07-2025 ఇట్లు
శ్రీ ముమ్మడి ప్రభాకర్ రెడ్డి, న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. **9948822599**